క్లుప్తంగా

విండ్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఇండస్ట్రియల్‌కాలనీలో శనివారం ఇండస్ట్రియల్‌కాలనీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత చెడు దారులు పట్టకుండా నచ్చిన క్రీడల్లో రాణించి పుట్టిన ప్రాంతంతో పాటు కన్న వారికి పేరు తీసుకురావాలన్నారు. క్రికెట్‌కు ఉజ్వల భవిత ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాడి సత్యనారాయణ,కొల్లి నూకరెడ్డి, సోనూ,మూగి సూర్యనారాయణ,బూస అప్పలరెడ్డి,స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీటీఈఎల్‌లో బెహరా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ విజయ చైతన్య

గోపాలపట్నం: జాతీయ స్థాయి ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో నవర బెహరా కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. నేషనల్ ప్రొగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హెన్స్‌డ్ లెర్నింగ్ (ఎన్‌పీటీఈఎల్) సంస్థలో ఆన్‌లైన్ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులను శనివారం బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ విజయ చైతన్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీలో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. వాటికి విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయం

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలని మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి ఎం. శ్యాంప్రసాద్ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ప్రతినిధులకు క్రమశిక్షణ తప్పనిసరి అని పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విధుల నిర్వహణకు సంబంధించి కౌన్సిల్ సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాధితులపై కౌన్సిల్ సభ్యులు బెదిరింపులకు పాల్పడితే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ హక్కుల కౌన్సిల్ వలంటీర్లు తమకు తామే జవాబుదారీగా, నిజాయితీగా ఉండాలని, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పని చేయాలన్నారు. ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్. కోటలో వెయ్యికి పైగా మొక్కలు నాటనున్నట్టు శ్యాంప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణ, సూర్య, శ్రీనివాస్, ప్రసాద్, సీనియర్ సభ్యుడు గుండు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం



విగ్రహానికి చక్రస్నానం చేస్తున్న రుత్వికులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ బేడా ప్రదక్షిణ జరిపారు. తర్వాత స్వామికి అవబృధోత్సవం, స్వామికి చక్రస్నానం జరిపారు. అనంతరం స్వామికి పూర్ణాహుతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.

కొండవాలులో గుబులు

- కానరాని రక్షణ గోడలు
- విరిగిపడుతున్న కొండ చరియలు
- భయాందోళనల్లో నివాసులు



రక్షణ గోడలు లేని ఇందిరా కాలనీ కొండవాలు ప్రాంతం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని కొండవాలు ప్రాంతాలకు రక్షణ కరువైంది. జీవీఎంసీ 59, 60, 61 వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు లేక నివాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కూలిన రిటైనింగ్ వాల్.. మరి కొన్ని చోట్ల అసలు గోడలే లేకపోవడం వంటి సమస్యలు వారిని కలవరానికి గురిచేస్తున్నాయి. రానున్నది వర్షా కాలం కావడంతో కొండ చరియలు విరిగి పడి తమ నివాసాలపై పడతాయేమోనని హడలి పోతున్నారు.

వర్షా కాలంలో ప్రమాదాలు..

ఈ వార్డుల్లోని జనతా కాలనీ, ఇందిరా కాలనీ–1, 2, అశోక్‌నగర్, గణపతినగర్, హిమాచల్ నగర్, వాయుపుత్ర కాలనీ తదితర కొండవాలు ప్రాంతాల్లో సుమారు 60 వేల మంది వరకు జనం నివసిస్తున్నారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఈ కాలనీల్లో రక్షణ గోడలు బీటలు వారడం, కొన్ని చోట్ల కూలడం వంటివి జరిగాయి. ఇందిరా కాలనీ, హిమాచల్ నగర్ కొండ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు బండరాళ్లు దొర్లి దిగువనున్న ఇళ్లపై పడ్డాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఆస్తి నష్టం మాత్రం ఎక్కువగా జరిగింది. ఈ ఘటనతో కొందరు తమకు గృహాలకు ఇనుప రేకులు అడ్డుగా పెట్టుకున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని దృఢమైన రక్షణ గోడలు నిర్మించాలని ఆయా కొండవాలు ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



పారిశ్రామిక ప్రాంతంలోని కొండవాలు ప్రాంతాల్లో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడుతున్నాయి. కొన్ని చోట్ల రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలి.

– రేవళ్ల సత్యనారాయణ, గణపతినగర్

రక్షణ గోడలు నిర్మించాలి



పలు జీవీఎంసీ వార్డుల్లోని కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ఉన్నతాధికారులకు అనేక వినతులు ఇచ్చాం. అయినా స్పందన లేదు. స్థానికుల భయాందోళనలను దృష్టిలో పెట్టుకుని రక్షణ చర్యలు తీసుకోవాలి.

– పంచదార్ల అప్పలరాజుయాదవ్, మల్కాపురం

టెండర్లు పిలిచాం.. చర్యలు తీసుకుంటాం

కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి టెండర్లు పిలిచాం. ఆయా ప్రాంతాలకు వచ్చి నిర్మాణానికి అవసరమైన సామగ్రి, ఇసుక, పిక్క, సిమెంట్ తదితర వాటిని తీసుకెళ్లడం కష్టమని కాంట్రాక్టర్లు వెనుదిరుగుతున్నారు. వర్షాలు ఎక్కువ కాక ముందే రక్షణ గోడలు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– ఏడుకొండలు, వర్క్స్ డీఈ, జీవీఎంసీ

ఉల్లాసంగా.. ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ



జెండా ఊపి సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న షిప్‌యార్డ్ అధికారి గుప్తా

సింధియా: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర రక్షణ శాఖ ఆదేశాల మేరకు హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఆధ్వర్యంలో మే 20వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం కార్మికులంతా కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. షిప్‌యార్డ్ మెయిన్ గేటు వద్ద ప్రారంభమైన సైకిల్ ర్యాలీ వాల్‌చంద్ గేట్, సింధియా గేట్ నుంచి మల్కాపురం పోలీస్‌స్టేషన్ వరకు సాగి తిరిగి షిప్‌యార్డ్ మెయిన్ గేట్ వద్ద ముగిసింది. ఈ సైకిల్ ర్యాలీని షిప్‌యార్డ్ డైరెక్టర్ కార్పొరేట్ అండ్ ప్లానింగ్ అధికారి జీపీ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వారంలో ఒక్క రోజైనా మోటారు వాహనాలు వీడి సైకిల్‌పై విధులకు హాజరు కావాలన్నారు. కార్మికులు ఆరోగ్యంతో పాటు పర్యావరణం మీద అవగాహన కలిగి ఉండాలని, ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు, ఉద్యోగులు, షిప్‌యార్డ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో భక్తులు, అర్చకులు



గొల్లకంచరపాలెంలో సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: స్థానిక తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాస శుద్ధ చతుర్థశి శనివారం పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగన్నాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష పూజలు, పంచామృతా భిషేకాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి పద్మావతి, ఆలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

సంపత్ వేంకటేశ్వరుడికి అర్చనలు

స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, అలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, తులసీదళ బిల్వా ర్చనలు చేశారు. ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు, సేవా దళ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

తండ్రికే కొడుకు టోకరా

- న్యాయం చేయమని ఏఆర్ ఎస్‌ఐ వేడుకోలు

మర్రిపాలెం: ఏఆర్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న తనకు అన్యాయం జరిగిందంటూ కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు కాపారపు దొంగబాబు తన గోడు వినిపించారు. వివరాలిలా.. బాపూజీనగర్ అంబేద్కర్ కాలనీలో నివసిస్తున్న దొంగబాబుకు కొంతకాలం కిందట జరిగిన ఓ ప్రమాదంలో కాలు పోయింది. ఆయనతో అతడి కుమారుడు కొంత మొత్తం నగదు కోసం లోన్ పెట్టించాడు. కృత్రిమ కాలు పెట్టిస్తానని, విశాలాక్షినగర్‌లో వ్యాపారం కోసం షాపు పెట్టుకుంటానని, దానికి ష్యూరిటీ పెట్టమని తండ్రితో చెక్కుపై సంతకం పెట్టించుకున్నాడు. అంతటితో ఆగకుండా దఫదఫాలుగా తండ్రి ఖాతా నుంచి నగదు డ్రా చేసి ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేశాడు. ఈ క్రమంలో శనివారం ఏఆర్ ఎస్‌ఐ దొంగబాబు ట్రైసైకిల్‌పై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. సంగతి తెలుసుకున్న సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేరుగా బాధితుడి వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. పై అధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధితుడు తన కొడుకు, కోడలిపై ఫిర్యాదు చేశారు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



ఏఆర్ ఎస్‌ఐ దొంగబాబు నుంచి వివరాలను తెలుసుకుంటున్న సీఐ విజయ్‌కుమార్

842వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకోవాలన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 842వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వార్డుల్లో జోన్-5 కమిషనర్ పర్యటన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42, 44 వార్డుల్లోని రైల్వే న్యూకాలనీ, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో శనివారం ఉదయం జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ పర్యటించారు. చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిషేధం అమలు, శానిటేషన్ సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వెలగని వీధిలైట్లు



అంధకారంలో పల్లి వీధి

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం పల్లివీధి ప్రాంతంలో వీధి లైట్లు వారం రోజుల నుంచి వెలగడం లేదు. ఈ కారణంగా చీకటి పడితే చాలు పూర్తి అంధకారంగా మారుతుంది. సమస్యపై అధికారులు స్పందించాలి.

– రామ్మోహన్‌రావు, పల్లివీధి

ద్విచక్ర వాహనం చోరీ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ద్విచక్ర వాహనం దొంగతనానికి గురైంది. ఈ మేరకు క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్‌లో నివసిస్తున్న బాల అప్పలనాయుడు కంచరపాలెం సుభాష్‌నగర్‌లోని డీజిల్ లోకో షెడ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రోజూ మాదిరి గానే విధులకు వెళ్లి ఎప్పుడు పెట్టిన ప్రాంతంలోనే తన బైక్‌ను పార్క్‌చేశాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో ఐదో పట్టణ పోలీసులకు శనివారం అప్పలనాయుడు ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ దుర్గా ప్రసాద్ నేతృత్వంలో ఎస్‌ఐ సునీల్ కేసు దర్యాప్తు చేపట్టారు.

స్టీల్‌ప్లాంట్‌లో మొక్కలు నాటిన అధికారులు



ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న డైరెక్టర్ పాండే

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శనివారం సామూహికంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉక్కు ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో ఉక్కు జనరల్ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అనేక చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ఉత్పత్తికి తగ్గట్టు మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 400 కొబ్బరి, సపోటా, జామ మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ సీజీఎంలు జి. గాంధీ, వై. చంద్రశేఖర్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం అవసరం

సీతంపేట: గ్రంథాలయాల పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్తంగా బైకుపై సంచరిస్తున్న ఒంగోలుకు చెందిన మంచికంటి వెంకటేశ్వర్లు శనివారం ఉదయం నగరానికి చేరుకున్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయానికి వచ్చిన ఆయనకు లైబ్రరీ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఒంగోలులో బయలుదేరి రాయలసీమ అంతా పర్యటించి, కోస్తా జిల్లాల మీదుగా ఉత్తరాంధ్రకు వచ్చానని తెలిపారు. గ్రంథాలయాల పరిరక్షణ, అభివృద్ధికి మరో గ్రంథాలయ ఉద్యమం అవసరమన్నారు. ప్రజల వద్దకు పుస్తకం తన నినాదమని, సొంత డబ్బుతో పుస్తకాలు ముద్రించుకునే వారు లేక కొంత మంది రచయితలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వదాన్యులు, సేవా తత్పరులు గ్రంథాలయాలను ప్రోత్సహించాలని కోరారు. పాఠశాలల్లో గ్రంథాలయాలు పిల్లలకు దేవాలయాలని అభివర్ణించారు. రచయితల కోసం సహకార వేదికలు ఏర్పాటు కావాలని సూచించారు. తన పర్యటనలో అనుభవాలను వివరించారు. విశాఖ పౌర గ్రంథాలయం ప్రగతి అభినందనీయని, ఇతర ప్రాంతాల వారికి ఇది ఒక మంచి నమూనాగా పేర్కొన్నారు. మిత్ర సాహితి వర్మ, అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్ హౌస్ రాజు, కత్తి పద్మ తదితరులు వెంకటేశ్వర్లును అభినందించారు.

నూతన కమిటీ సభ్యులకు అభినందన

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పాతగోపాలపట్నం సీతారామ అభయాంజనేయ గ్రామ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు శనివారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సభ్యులను బెహరా భాస్కరరావు అభినందించారు. గ్రామ సేవా సంఘం గౌరవ అధ్యక్షులుగా బల్లంకి వెంకటరావు, పట్నాల నరసింహమూర్తి, ముమ్మన సత్యనారాయణ, అధ్యక్షుడిగా పట్నాల నూకరాజు, ఉపాధ్యక్షులుగా కరణం కనకరాజు, గొలగాని అప్పారాజు, కార్యదర్శిగా కొప్పాక సన్యాసిరావు, కోశాధికారిగా బొడ్డేపల్లి తోటరాజు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు.



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న బెహరా భాస్కరరావు

అనధికార పార్కింగ్‌పై కొరడా



అనధికారికంగా పార్క్‌చేసిన వాహనాలను వ్యాన్ సాయంతో తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు ఉల్లంఘించి నిలిపిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు శనివారం కొరఢా ఝుళిపించారు. హెచ్‌పీసీఎల్ కల్యాణి గేటు ముందు,నేవల్ చిల్డ్రన్ స్కూల్ ఏరియా,మల్కాపురం సర్వీసు రోడ్లలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసినా ఖాతరు చేయకుండా పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను ఓ వ్యాన్‌లో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపడం వల్ల ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మల్కాపురం: మన చుట్టూ ఉన్న ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం అన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత బాధ్యతగా మెలిగితే దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు 12 రోజుల నుంచి వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా శనివారం స్వచ్ఛభారత్ చేపట్టారు. గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నెలలో ప్రతి తొలి శనివారం గ్రంథాలయాల్లో మనం మన గ్రంథాలయం అనే కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రజలు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో రచయిత కె.సత్తిరాజు, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని పరిశుభ్రం చేస్తున్న చిన్నారులు

వాకర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయం



చెస్ పోటీల విజేతలతో ఉప్పలపాటి శుభ, క్లబ్ ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. స్థానిక వాకర్స్ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన క్లబ్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, పిల్లలకు, విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. క్లబ్ సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా చేరిన సభ్యులకు వాకర్ పిన్, ప్యాట్రన్ మెడల్‌ను ఆమె అందించారు. ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న వారిని చిరు కానుకలతో సత్కరించారు. 12 రోజులుగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత చెస్ శిక్షణలో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను శుభ అందించారు. చెస్ కోచ్ ఎస్.ఉమాపతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహ జయంతి

సింహాచలం: సింహగిరితో పాటు శ్రీకృష్ణాపురంలోని నృసింహస్వామి విగ్రహం వద్ద శనివారం నృసింహ జయంతిని విశేషంగా నిర్వహించారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆవిర్భవించిన సాయం సంధ్యావేళ ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపారు. తొలుత స్వామివారి మూలవిరాట్ చెంతన విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచకలశ స్నపనం, అర్చన నిర్వహించారు. అనంతరం క్షేత్రమహత్యంలో ఉన్న నృసింహ ఆవిర్భావ ఘట్ట పురాణ విన్నపం చేశారు. స్వామికి విశేషంగా హారతులు అందజేశారు. వేదమంత్రోచ్ఛరణలతో స్వామిని కొలిచారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు పూజలను నిర్వహించారు.

- శ్రీకృష్ణాపురంలోని నృసింహ వనంలో శనివారం నృసింహ జయంతిని దేవస్థానం వైదికులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపై ఉన్న భారీ నృసింహ స్వామి విగ్రహం, ప్రహ్లాదుడి విగ్రహం వద్ద పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం సాయం సంధ్యావేళ ఆవిర్భావ ఘట్ట విన్నపాన్ని చేశారు. తదుపరి స్వామివారి అష్టోత్తర పూజ నిర్వహించారు. నమో నారసింహా అంటూ స్వామికి విశేషంగా హారతులిచ్చారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



నృసింహస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, పాల్గొన్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.92 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ ఆలయంలో శనివారం దేవదాయ శాఖ తనిఖీదారు ఎ.జగన్నాథం పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కింపు జరిగింది. 23 రోజులకు గాను రూ.16,92,807 నగదుతోపాటు 5.2 గ్రాముల బంగారం, 165 గ్రాముల వెండి విరాళంగా వచ్చింది. 31 యూఎస్‌ఏ డాలర్లు, 2 సింగపూర్ డాలర్లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.ఆర్.చోళన్ తెలిపారు. కార్యక్రమంలో శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాలయ సిబ్బంది జి.గోవింద్‌రెడ్డి, డీఎస్ ప్రసాద్, ఇ.అప్పలరాజు పాల్గొన్నారు.